క్లుప్తంగా

పంచమఠాలలో విశేష పూజలు



పంచమఠాలలోని స్వామివారికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించి ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, పర్యవేక్షకులు హరికృష్ణారెడ్డి, ప్రధానార్చకులు పాల్గొన్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



వెండిరథోత్సవాన్ని నిర్వహిస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రం శ్రీశైలమహాక్షేత్రంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథం పై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలి



సంతకాలు సేకరిస్తున్న సాధన సమితి నాయకులు

నందికొట్కూరు: కర్నూలు జిల్లాకు తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి నియోజకవర్గ కో ఆర్డినేటర్ నాగేష్, సలహాదారులు వేల్పుల సుంకన్న, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తేనే నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం పటేల్ సెంటర్‌లో కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సాధన సమితి నాయకులు జైపాల్, డాక్టర్ రాజు, మనోహర్, అంకన్న, మోహన్‌దాసు, అర్లప్ప, శివ, ఏసేపు, నాగన్న, శ్రీను, పుల్లన్న పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పగిడ్యాల: స్థానిక మోడల్ స్కూల్‌లో సోమవారం ఎంపీడీఓ నాగేంద్రకుమార్, ఎంఈఓ సుభాన్ మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. బోగస్ అటెండెన్స్‌కు పాల్పడకుండా మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డికి సూచించారు. మధ్యాహ్న భోజన పథకం రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. వారి వెంట ఎంఈఓ -2 మురళీమోహరెడ్డి ఉన్నారు.

అధికారులు మొద్దు నిద్ర వీడాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కొత్తపల్లి: ఆత్మకూరు నుంచి కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వర వరకు ఉన్న ప్రధాన రోడ్డు గుంతల మయమై అధ్వానంగా ఉన్నా ఆర్ అండ్ బీ అధికారులు కన్నెత్తి చూడడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి టి రమేష్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు వి యేసురత్నం విమర్శించారు. సోమవారం సింగరాజు పల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ మొద్దు నిద్రవీడి అడుగడుగునా గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఎస్ స్వాములు, నాయకులు ఎస్ దాసు, ఎం జ్ఞాన సూర్యుడు, జి దాసు పాల్గొన్నారు.

దశలవారీగా ఆందోళనలు



మాట్లాడుతున్న ఎస్.సతీష్‌కుమార్



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఆత్మకూరు: విద్యుత్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యాల పరిష్కారానికి దశలవారీగా ఆందోళనలు చేస్తామని విద్యుత్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ కార్మికుల కర్నూలు జిల్లా జేఏసీ చైర్మన్ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆత్మకూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. సమావేశంలో జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ పి.వి.రామరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.ఎం.ప్రసాద్, 327 యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి దమ్లానాయక్, డివిజన్ నాయకులు మధుకుమార్, మధుకృష్ణ, కిరణ్‌కుమార్, కిరణ్, సుల్తాన్ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

బండి ఆత్మకూరు: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ రంగ సంస్థ కార్మికులు తమ దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కారం కోసం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు ఇస్మాయిల్, వెంకటయ్య, శ్రీనివాసులు, శేఖర్, రామ్ పుల్లయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: జేఎల్‌ఎం-గ్రేడ్ 2లను వెంటనే రెగ్యులర్ చేయాలని, విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులను పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని విద్యుత్ శాఖ ఉద్యోగులు శంకర్, శేషయ్య డిమాండ్ చేశారు. మహానంది సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఖాళీగా ఉన్న అన్ని ప్రారంభ స్థాయి పోస్టులను భర్తీ చేయాలన్నారు. పొరుగు సేవల సిబ్బందిని విద్యుత్ సంస్థల్లో విలీనం చేసి సమాన పనికి సమాన వేతనం ఇచ్చేలా చూడాలన్నారు.

సున్నిపెంటలో..

శ్రీశైలంప్రాజెక్ట్: విద్యుత్ రంగ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆందోళన నిర్వహించారు. ఏపీ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ఏపీ ట్రాన్స్‌కో కాంట్రాక్ట్ కార్మికులు సున్నిపెంట సబ్‌స్టేషన్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, కార్మికులకు ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలని, పెండింగ్ అరియర్స్‌ను మంజూరు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు.

మహానందీశుడికి పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు, మహామంగళ హారతులు, బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో భాజాభజంత్రీల మధ్య పల్లకీసేవ నిర్వహించారు.

మల్లన్నకు నృత్యనీరాజనం



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన కె.సౌందర్య, బృందం వారి సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మూషికవాహన, శ్రీవిఘ్నరాజం భజే, శివాష్టకం, లింగాష్టకం, భో శంభో, శివ తాండవ స్తోత్రం తదితర గీతాలకు మాధురి, లాస్యభారతి, స్నిగ్ధశ్రావణి, షణ్ముకి, సహస్ర, ధార్మికయమున, సిరి, సింధు, శైలజ కాత్యాయని, కీర్తన, గాయత్రి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

వాహనమిత్ర అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆటో కార్మికులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆటో కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని ఆటో కార్మిక సంఘం నాయకులు రాజయ్య, లక్ష్మయ్య, ఓబులయ్య, అనిల్‌కుమార్, పులిరాజు, మల్లికార్జున, బాలనరసింహ డిమాండ్ చేశారు. సోమవారం వారు శ్రీశైలం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో కార్మికులు రోడ్డున పడ్డామని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. శ్రీశైలం, సున్నిపెంట గ్రామాల్లో ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కె.వి. శ్రీనివాసులుకు అందజేశారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నందికొట్కూరు: పల్లె నాగరాజు ఇల్లు కూల్చిన అవినీతి అధికారులు తహసీల్దార్ శ్రీనివాసులును, టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు సోమవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు పల్లె నాగరాజు, జాలం నాగన్న, రజిత మాట్లాడుతూ ఇంటిని కూల్చిన ఇద్దరి అధికారులపై జిల్లా అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

పీజీఆర్ఎస్‌ను ఉపయోగించుకోండి

కొత్తపల్లి: ప్రభుత్వం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

హైర్ బస్ డ్రైవర్ల డిపో కమిటీ ఎన్నిక

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్‌వీ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం హైర్ బస్ డ్రైవర్ల ఆత్మకూరు డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు కె.సుదర్శన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శి భద్రావతి, జిల్లా కార్యదర్శి శివరాం, జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్ డి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ ఆధ్వర్యంలో డిపో చైర్మన్‌గా ఎం.దాస్, ప్రెసిడెంట్‌గా కలిముల్లా, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.అజాజ్, చీఫ్ అడ్వైజర్‌గా నాగేంద్ర ఆచారి, డిపో సెక్రటరీగా ఎంఎం బాషాలను ఎన్నుకున్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



దెబ్బతిన్న పంటను చూపుతున్న నాయకులు

ఆత్మకూరు: మండలంలోని దెబ్బతిన్న పంట పలాలను సోమవారం ఆత్మకూరు రైతుసేవ సంఘం గౌరవాధ్యక్షుడు మోమిన్‌మునీర్‌బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా కృషి పండ్లతోటల సంఘం అధ్యక్షులు బైరాపురం మహబూబ్‌బాషా మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా కృషి చేయాలన్నారు.

వేధింపుల కేసు నమోదు

బండి ఆత్మకూరు: భర్త అన్వర్, అత్త షేక్ బీబీ అదనపు కట్నం కావాలని వేధింపులకు పాల్పడుతున్నారని లింగాపురం గ్రామానికి చెందిన షేక్ మాబున్ని ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సోమవారం ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

బండి ఆత్మకూరు: ఎ.కోడూరు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పాపిశెట్టి ధర్మ రాయల్ (19) సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆటో డ్రైవర్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఆలయంలో అపవిత్ర పనులకు పాల్పడిన వ్యక్తిపై ఫిర్యాదు

మహానంది: మహానంది మండలం బొల్లవరం గ్రామంలోని ఈశ్వరాలయంలో అపవిత్ర పనులకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కర్నూలు బసవరాజు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. పవిత్రమైన ఆలయంలో ఓ మూత్ర విసర్జన చేయడం అత్యంత దారుణమన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్ఐను కోరారు.

ద్విచక్రవాహనదారుడికి గాయాలు



గాయపడిన శివ

కొత్తపల్లి: ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన మాదిగ శివ గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. శివ సోమవారం బైక్‌పై ఆత్మకూరుకు సొంత పనుల నిమిత్తం వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. కొత్తపల్లి - బావాపురం గ్రామాల మధ్య మలుపువద్ద బైకు అదుపు తప్పడంతో శివ కింద పడి తలకు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: ఆర్టీసీ డిపోలో హైర్ బస్సు డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికీ వేతనాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి.రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. సోమవారం సుదర్శనవర్మ భవనంలో హైర్ బస్సు డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లగా ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్లుగా పనిచేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అయినా ఉద్యోగ భద్రత లేదని, శ్రమకు తగిన వేతనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులు ఎక్కువయ్యాయని, దీనివల్ల డ్రైవర్లు మనశ్శాంతిగా డ్రైవింగ్ చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫ్రీ బస్సు సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో ఓవర్ లోడుతో బసుస్సు డ్రైవింగ్ చేస్తూ ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరుస్తున్నారన్నారు. కానీ డ్రైవర్ల ఉద్యోగానికి భద్రత లేదన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు డ్రైవర్లపై వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో హైర్ బస్ యూనియన్ అధ్యక్షులు మౌలాలి, కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు రాముడు, సహాయ కార్యదర్శి జనార్దన్, ట్రెజరర్ షాకీర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి కుమార్

ఆత్మకూరు: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి డక్క కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు పట్టణంలోని పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను ఆపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చరణ్‌నాయక్, విక్రమ్, వసంత్, సునీల్, సుమంత్ పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి

శ్రీశైలంప్రాజెక్ట్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని సోమవారం సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజనీతిశాస్త్ర అధ్యాపకులు మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశం గర్వించదగిన ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బుచ్చయ్య, అధ్యాపకులు డాక్టర్ శివనాగిరెడ్డి, ఇందిరా ప్రియదర్శిని, ఫాహిదాబేగం, మీనాక్షి పాల్గొన్నారు.

ప్రకృతి ఆధారిత ఆకుకూరలు ఆరోగ్యానికి మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: ప్రకృతి వ్యవసాయం ఆధారంగా పండించిన ఆకు కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలని డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, రీసర్వే డీటీ నాగన్న తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఆధారిత పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయల స్టాల్‌ను సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. ఈసందర్భంగా వారు అక్కడికొచ్చిన రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. కార్యక్రమలో సీఆర్పీలు పార్వతి, జయమ్మ, వెంకటశేషమ్మ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

రచయితకు సన్మానం



జంధ్యాల రఘుబాబును సన్మానిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు రచయిత జంధ్యాల రఘుబాబును సోమవారం ప్రిన్సిపాల్ రంగముని, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ అన్వర్ హుసేన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జంధ్యాల రచనలు, కవితలు ప్రజల జీవన విధానానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. రచయిత జంధ్యాల మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే సాధనమే కలమన్నారు. అనంతరం జంధ్యాల రచించిన తెలుగు పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రవి, అధ్యాపకురాలు డాక్టర్ పరిమళ పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి విరాళాలు

మహానంది: మహానందిలో అన్నప్రసాద పథకానికి మసీదుపురం గ్రామానికి చెందిన నరాల మౌళీశ్వర రెడ్డి, నూనెపల్లెకు చెందిన రమాదేవి రూ.10 వేల చొప్పున విరాళాలు అందించారు. సోమవారం వారు ఆలయానికి చేరుకుని స్వామివారి దర్శనం అనంతరం ఆలయ సూపరింటెండెంట్ నీలకంఠేశ్వరరాజు, అన్నప్రసాద పథకం ఇన్‌చార్జ్ రామశివలకు విరాళాలు చెల్లించారు. వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి బాండ్లు అందజేశారు.

పరీక్షలంటే భయం పోగొట్టాలి

మహానంది: పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏపీ మోడల్ స్కూల్స్ స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి ఆదేశించారు. ఎం.తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంఓ కృష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా నీట్ కోచింగ్ ఇవ్వాలన్నారు. పరీక్షలంటే విద్యార్థులకు భయం లేకుండా మానసికంగా ధైర్యం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ విద్యాబోధన ఉందన్నారు. ఎంఈఓ రామసుబ్బయ్య, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు.

స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మహిళలు స్వయం ఉపాధిరంగాల్లో రాణించాలని జూపాడుబంగ్లా సర్పంచ్ మొట్టె బాలయ్య, ఎంపీటీసీ మోతె వెంకటమ్మ, జిల్లా కోఆర్డినేటర్ నీరజ తెలిపారు. సోమవారం జూపాడుబంగ్లాలో పొదుపు మహిళలకు పచ్చళ్ల తయారీ శిక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. పక్షం రోజులపాటు మహిళలకుపచ్చళ్ల తయారీపై శిక్షణ ఇవ్వటంతో పాటు సర్టిఫికెట్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ గోపాల్ పాల్గొన్నారు.

నేడు బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కాంప్లెక్స్ సందర్శన



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల(అర్బన్): బానకచర్ల రెగ్యులేటర్ కాంప్లెక్స్ వద్ద రాయలసీమ నీటి హక్కులతో జరిగే నష్టంపై చేపట్టే సందర్శన కార్యక్రమానికి రైతులు, ప్రజలు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. తెలుగుగంగ, హంద్రీనీవా, ఎస్సార్బీసీ, గాలేరునగరి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులను ఆయా ప్రాంత ప్రజా సంఘాల నాయకుల ద్వారా తెలుసుకొని పాలకులపై ఒత్తిడి పెంచేందుకు రావాలన్నారు. స్థానిక కార్యాలయంలో సమితి నాయకులతో కలిసి సోమవారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ హక్కుగా ఉన్న నీటిని సకాలంలో అందించాలన్నారు. రెగ్యులేటర్ల నీటి ప్రవాహాన్ని మార్చి కృష్ణా జలాలను నెల్లూరు వైపు తరలించే కార్యక్రమం చేపట్టడం దారుణమన్నారు. సీమలో బలవంతపు భూసేకరణ, కుందూ గాలేరి నదులను కాల్వగా మార్చే క్రమంలో పర్యావరణ నాశనానికి పాలకులు శ్రీకారం చుట్టబోతున్నారన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు వెనుక జలాలను రాయలసీమకు అందించడానికి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌తో పాటు మరొక నిర్మాణం హంద్రీనీవా, ఎత్తిపోతల పథకం అవసరమన్నారు. ఈ పథకం ద్వారా మల్యాల నుంచి కృష్ణా జలాలను ఎత్తి పోస్తూ 6లక్షల ఎకరాలకు నీరు అందించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వైఎస్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి



టీకాల కార్యక్రమం పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాసరావు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

మహానంది: రైతులు పాడి పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు కోరారు. తమ్మడపల్లె గ్రామంలో సోమవారం ప్రారంభించిన గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎద సూదులను సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. అలాగే పశుగ్రాసం కోసం రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్నామని, రైతులు వినియోగించుకోవాలన్నారు. గడ్డి విత్తనాలు నాటుకుని పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో పశు గ్రాసం కొరత ఉండదన్నారు. పశువైద్యాధికారి కరుణాకర్, వీఎల్ఓ సులోచనలతో వివిధ అంశాలపై అడిగి తెలుసుకున్నారు. తమ్మడపల్లె గ్రామంలో 224 పశువులకు గాలికుంట నివారణ టీకాలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తతంగా ఉండాలి

వెలుగోడు: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆకుల వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. మోతుకూరు పశువైద్య అధికారి డాక్టర్ కె.కిషోర్‌కుమార్ రెడ్డి, రేగడగూడూరు పశు వైద్యాధికారి, ఎమ్.సుమన్ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు గాలి కుంటు నిరోధక టీకాలు వేసి రైతులకు సలహాలిచ్చారు.

పశువులను కాపాడుకోండి

బండి ఆత్మకూరు: పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించి కాపాడుకోవాలని వెటర్నరీ డాక్టర్లు అనూష, జ్యోత్స్న సూచించారు. సోమవారం బండిఆత్మకూరు, సింగవరం గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు రైతులకు అవగాహన కల్పించారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కాలనీ ప్రజలు

నందికొట్కూరు:మారుతీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మారుతీనగర్ వాసులతో కలిసి సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, విద్యుత్ సరఫరా, నీటి వసతులు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యుత్ లోఓల్టేజీతో సరఫరా అవుతుండటంతో ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేనియెడలా నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు,మున్సిపల్ కమిషనర్ బేబికి వినతిపత్రాలు అందజేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్, కాలనీ వాసులు హుసేన్, కమల్ సాహెబ్, అబ్దుల్లా, మగ్బూల్, రాము, చిట్టెన్న, సాలమ్మ, ఫాతిమా పాల్గొన్నారు.